సాక్షి
తిరుపతి

గురువారం । 29 । జూన్ । 2023



విద్యారంగానికే అధిక కేటాయింపులు

ప్రభుత్వం విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేస్తున్నట్లు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. - IIలో



రూ.32.31 కోట్లతో రోడ్లకు మహర్దశ

గ్రామీణ రోడ్లకు ప్రభుత్వం మహర్దశ తీసుకువస్తోందని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి తెలిపారు. - IIలో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	24
చిత్తూరు	34	26
తిరుమల	32	22
గూడూరు	38	28
నగరి	37	27

న్యూస్‌రీల్

రేషన్ దుకాణాల్లో రాగుల పంపిణీ

– జిల్లాకు 1,835 టన్నులు



సుమతి, సివిల్ సప్లయ్ మేనేజర్

తిరుపతి అర్బన్ : రేషన్ దుకాణాల్లో జూలై నుంచి రాగులు కూడా పంపిణీ చేయనున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ సుమతి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రతి కార్డుదారుకు 3కేజీల రాగులను అందించనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం జిల్లాకు 1,835 టన్నుల రాగులను కేటాయించారని వివరించారు.

ఎస్వీయూ ఓరియంటల్ జర్నల్ ఆవిష్కరణ



జర్నల్ ఆవిష్కరిస్తున్న వీసీ రాజారెడ్డి తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రాచ్య పరిశోధనా సంస్థ ఏటా ప్రచురించే శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఓరియంటల్ జర్నల్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఎస్వీయూ ప్రాంగణంలో ప్రాచ్య పరిశోధనా సంస్థ డైరెక్టర్ డాక్టర్ తమటం సురేంద్రారెడ్డితో కలిసి వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి విడుదల చేశారు. వీసీ మాట్లాడుతూ 63వ ఓరియంటల్ జర్నల్ వాల్యూమ్‌ను ఆవిష్కరించడం సంతోషకరమన్నారు. వర్సిటీలోని వివిధ విభాగాల్లో ప్రాచ్య పరిశోధన సంస్థ విలక్షణమైనదని వెల్లడించారు. ఓరియంటల్ జర్నల్‌కు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాచ్య పరిశోధన సంస్థ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పీసీ వెంకటేశ్వర్లు, ఎం.చంద్రశేఖర్, డాక్టర్ టి.రాజశేఖర్, డాక్టర్ రమేష్, కె.గౌస్‌బాషా పాల్గొన్నారు.

నూతన ఒర'బడి'..

అమ్మఒడి

విద్యతోనే సమాజంలో ఆర్థిక అసమానతలను రూపుమాపగలం.. పిల్లలను చక్కగా చదివిస్తే పేదకుటుంబాల్లో వెలుగులు నింపగలం.. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందుబాటులోకి తీసుకువస్తే పోటీ ప్రపంచంలో దీటుగా నిలబడే ఆత్మస్థైర్యాన్ని అందించగలం.. ఇదే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన పథకాలను అమలు చేస్తున్నారు. అందులో భాగంగా 'జగనన్న అమ్మఒడి' కింద ఏటా ఒక్కొక్కరికి రూ.15వేల చొప్పున అందజేస్తున్నారు. అత్యంత పారదర్శకంగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్‌చక్రవర్తి తదితరులు

- విద్యారంగం అభివృద్ధికి విప్లవాత్మకమై పథకాలు
- నాలుగో ఏడాదీ విద్యార్థులకు ఆర్థిక భరోసా
- 1,68,367 మంది తల్లుల ఖాతాల్లో రూ.252.55 కోట్లు జమ
- జిల్లాస్థాయి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

గూడూరు : విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని, వివిధ సంక్షేమ పథకాలతో విద్యార్థులకు చేయూతనందిస్తోందని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం గూడూరు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న అమ్మఒడి పథకం జిల్లా స్థాయి కార్యక్రమంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, బల్లి కల్యాణ్‌చక్రవర్తితో కలిసి ఆయన పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వరుసగా నాలుగో ఏడాది అమ్మఒడి నగదు పంపిణీ చేస్తున్నామన్నారు. ఒకటి నుంచి ఇంటర్ వరకు అర్హులైన ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో నేరుగా నగదు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు జిల్లాలో 1,68,367 మంది లబ్ధిదారులకు రూ 252.55 కోట్లు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా ఒక్క అమ్మఒడి పథకం కిందే సుమారు రూ.వెయ్యి కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చించిందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ సమాజంలోని అసమానతలు తొలగిపోవాలంటే విద్యతోనే సాధ్యమన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పేద విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఏటా రూ.15వేల చొప్పున అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి వారిని మంచి పౌరులుగా తీర్చిదిద్దితే అదే మన ఆస్తి అని నమ్మే ఆదర్శ నేత జగనన్నని తెలిపారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వినూత్న పథకాలతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని వివరించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, డీఈఓ శేఖర్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు బొమిడి శ్రీనివాసులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు విస్తృత ఏర్పాట్లు

చిత్తూరు అర్బన్: త్యాగానికి, మతసామరస్యానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్‌రెడ్డి సూచించారు. ఈద్గాల వద్ద ఎలాంటి ఇబ్బంది లేకుండా తగిన ఏర్పాట్లు కూడా చేశామని వెల్లడించారు.

ఇక రిజిస్ట్రేషన్ వెరీ ఈజీ

ఏ రకమైన రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా దూర ప్రాంతాల్లోని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లాలి. ఇందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడాలి. కార్యాలయాల వద్ద దళారుల దోపిడీ. ఇదంతా గతం. ప్రజల ఇబ్బందులకు చెక్ పెడతూ గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అన్ని రకాల రిజిస్ట్రేషన్ సేవలు అందించేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జిల్లాలోని 69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించింది. ఇవి కాకుండ ఫేజ్–2లో మరో 104 సచివాలయాలను ఎంపిక చేసింది.

- జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలకు 69 సచివాలయాలు ఎంపిక
- విడతల వారీగా అన్నింటికీ విస్తరణ
- పంచాయతీ కార్యదర్శికి సంయుక్త సబ్‌రిజిస్ట్రార్ హోదా


కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న చిత్తూరు జేసీ శ్రీనివాసులు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: రిజిస్ట్రేషన్ సేవలను సులభతరం చేస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను స్థానికంగా అందించాలనే ఉద్దేశంతో సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చింది. అందులో భాగంగా ఆస్తుల క్రయ, విక్రయాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌శాఖ సేవలను ఇప్పుడు సచివాలయాల్లో తీసుకొచింది. జిల్లాలోని 69 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్‌కు అనుమతి ఇచ్చింది. ఫేజ్–2లో మరో 104 సచివాలయాలను ఎంపిక చేయగా, ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నారు. రానున్న కాలంలో దశలవారీగా అన్ని సచివాలయాలల్లో ఈ సేవలను ప్రవేశపెట్టనున్నారు. సచివాలయ పంచాయతీ కార్యదర్శిని సంయుక్త సబ్‌రిజిస్ట్రార్‌గా హోదా కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా వ్యాప్తంగా భూ రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా తొలి విడతలో కొన్నింటిని ఎంపిక చేసింది.

కబ్జాలకు చెక్

ఎప్పుడో బ్రిటీష్ కాలంలో చేసిన సర్వేనే ఇప్పటికి ఆధారం. దీంతో భూముల క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్లు గందరగోళంగా ఉన్నాయి. ఫలితంగా గ్రామాల్లో భూ వివాదాలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా సర్వే నంబర్లలో సబ్‌డివిజన్లకు ప్రభుత్వం స్వస్తి పలుకుతోంది. ఉదాహరణకు 1,1ఏ,1బి,1బి/ఏ లాంటి సబ్‌డివిజన్ సర్వే నంబర్లు ఇక నుంచి ఉండవు. సర్వే నంబరు 1,2 ఇలా ఒకే నంబర్ ఉంటాయి. ఇప్పటి వరకు సబ్‌డివిజన్ల పేరుతో అక్రమాలు జరుగుతూ వచ్చాయి. ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న భూ రీ సర్వేలో ఊరు, సచివాలయ పరిధి, మండలం నమోదు చేస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ పక్కాగా ఉంటుంది. ఒకరి భూమిని మరొకరు కబ్జా చేసే పరిస్థితి ఉండదు.

చిత్తూరు జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్న సచివాలయాలు

చిత్తూరు,అగరమంగళం, రామభద్రపురం, పాపసముద్రం, పెరుమాళ్లకండ్రిగ, తవణంపల్లె, చరవనగనపల్లె, చిగరపల్లె, ఏర్రేపల్లె, పలమనేరు, పత్తికొండ, బిగలపల్లె, జలిపేట, మెర్రం, జీడీమాకులపల్లె, అప్పినపల్లె, ధర్మపురం, చామనేరు, బైరెడ్డిపల్లె, చింతమాకులపల్లె, నెలిపాటల, గంగవరం-3, మామడుగు, ఓగు, కలడు, చప్పిడిపల్లె, అంబేడ్కర్‌నగర్, కడపట్నం, కీలాపల్లె, నేర్లిపల్లె, కుప్పం,పెద్దబంగారునత్తం, గుండ్లసాగరం, శెట్టిపల్లె, వెండుగంపల్లె, సోడిగానిపల్లె,శివునికుప్పం, బెగ్గిలపల్లె,కొంగనపల్లె,కొత్తపల్లె, 64-పెద్దురూ, నడిమూరు, జరుగు, నేలకుంట, కాంచన బల్ల, చిన్నారిదొడ్డి, నూలకుంట, విగలపురం, మన్‌కల్‌దొడ్డి, కృష్టాదాసనపల్లె, చిల్లడిగానిపల్లె, దాండికుప్పం, మానేంద్రం, అనికిరా, సానిగానిపల్లె, మోరసానిపల్లె, పడిగాలకుప్పం, బైరుపల్లె, అనిగానూరు, 121 పెద్దురూ, కొలమడుగు, కీర్లాగుంట, కడపల్లె, శివరామపురం, పెద్దబ్బరెడ్డి, బి.పల్లె, కొంగటం, పెద్దవెలగటూరు, శంకరారాయపేట, ఇలవనెల్లూరు, తిమ్మనయునిపల్లె, ఓనగాండ్లపల్లె.

దశల వారీగా అన్ని చోట్ల

సచివాలయాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు అందిస్తున్నాం. సచివాలయ కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌కు ఆరునెలలుగా సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నందు శిక్షణ ఇచ్చాం. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతోంది. దశలవారీగా అన్ని సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలను ప్రభుత్వం తీసుకురానుంది.

– శ్రీనివాసరావు, చిత్తూరు జిల్లా రిజిస్ట్రార్



డెయిరీ మూస్తే తెరవని నోళ్లు..

- విగ్రహం తొలగింపుపై ఆరోపణలు
- నాడు రోడ్డున పడిన వారిపై మౌనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు విజయ సహకార డెయిరీని చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న హయంలో మూసేస్తే తెరవని నోళ్లు.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పునఃప్రారంభిస్తుంటే లేస్తున్నా యి. చిత్తూరులోని విజయ డెయిరీ మూసేసి 20 ఏళ్లు దాటింది. ప్రధాన గేటుకు బటయ వీర రాఘవులునాయుడు విగ్రహాన్ని 1999లో ఏర్పా టు చేస్తే, నాటి సీఎం చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. అప్పటి డెయిరీ చైర్మన్, టీడీపీ నేత దొరబాబు నాయుడు. సరిగ్గా విగ్రహాన్ని ఆవిష్కరించిన రెండేళ్లలో నష్టాల్లో ఉందంటూ డెయిరీని మూసేశారు. ప్రస్తుతం చిత్తూరు నగరంలోని చిత్తూరు–వేలూరు జాతీయ రహదారిపై ఆక్రమణల తొలగింపు జరుగుతోంది. ఇప్పటికే రోడ్డుకు ఆనుకుని ఉన్న పలు దుకాణాలను అధికారులు తీయించారు. దీనిపై పచ్చమీడియా తన అక్కసు వెళ్లగక్కుతూ సీఎం వస్తున్నారని దుకాణాలు తీస్తున్నారంటూ తప్పుడు కథనాలు వండి వార్చింది. తాజాగా డెయిరీ బయట ఉన్న వీర రాఘవులు నాయుడు విగ్రహాన్ని సైతం అధికార యంత్రాంగం అక్కడి నుంచి తొలగించి పక్కకు పెట్టింది. దీనిపై ఆయన కుమారుడు వెంకట్ నాయుడు బుధవారం ప్రెస్‌మీట్ పెట్టారు. తాను ఏ రాజకీయపార్టీకి చెందిన వ్యక్తికానని చెబుతూనే చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నపుడు తన తండ్రి విగ్రహాన్ని 1999లో ఆవిష్కరించారని చెప్పుకొచ్చారు. భగవంతుడు అవకాశమిచ్చి అధికారం ఇస్తే మంచి చేయాల్సింది పోయి విధ్వంసాలు చేయడం ఏమిటని తన అక్కసు వెళ్లగక్కా రు. చంద్రబాబు నాయుడు విగ్రహం ఆవిష్కరించిన రెండేళ్లల్లోపే విజయా డెయిరీని మూసేస్తే ఎందుకు మౌనంగా ఉన్నారు..? అపుడు రైతులు రోడ్డున పడితే ఎందుకు ప్రశ్నించలేదు..? వేలాది మంది ఉపాధి కోల్పోతే వీరరాఘవులు నాయు డు వారసుడిగా మీకు బాధ కలగలేదా..? పోరాటాలు ఎందుకు చేయలేదు..? అని మీడియా ప్రశ్నిస్తే అప్పట్లో చాలా ఉత్తరాలు రాశామంటూ సమాధానమిచ్చారు. అమూల్ డెయిరీని స్వాగ తిస్తున్నామని, తన తండ్రి విగ్రహాన్ని రెండు రోజుల్లో అక్కడు పునఃప్రతిష్ఠించాలని వెంకట్ నాయుడు డిమాండ్ చేశారు.

రూ.32.31 కోట్లతో గ్రామీణ రోడ్లకు మహర్దశ

కార్వేటినగరం: గత ప్రభుత్వాలు పట్టించుకోని మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణాలు చేపట్టి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహర్దశ కల్పించిందని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం గంగాధరనెల్లూరు మండలంలో పాత వెంకటాపురంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లలో జరిగిన రోడ్డు నిర్మాణ పనులే కాకుండా అదనంగా నియోజకవర్గం స్థాయిలో 24 రోడ్లకు మహర్దశ కలిగించడానికి రూ.32.31 కోట్లు మంజూరు చేయించినట్లు అన్నారు. ఈ నిధులతో కార్వేటినగరంలో 8 రోడ్లు, వెదురుకుప్పంలో 6, శ్రీరంగరాజపురంలో 5, పాలసముద్రంలో 2, పెనుమూరులో 2, జీడీనెల్లూరు మండలంలో ఒక్కొక్కటి చొప్పున 24 రోడ్లను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. రోడ్లకు అనవాళ్లు కోల్పోయినా గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకో లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాన్ని దత్తతకు తీసుకుని రెండవ పులివెందుల తరహాలో గంగాధరనెల్లూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నిధులు సంవృద్ధిగా మంజూరు చేస్తున్నారని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లి చరిత్ర సృష్టిస్తానని హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో గ్రామీణ రోడ్లను పూర్తిగా విస్మరించి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు.

పలమనేరులో హార్టికల్చర్ కోర్సులు

పలమనేరు: ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉండి, ఉద్యోగాలకు డిమాండ్ ఉన్న అనిమల్ హస్బెండరి, డెయిరీ టెక్నాలజీ, హార్టీకల్చర్ యూజీ కోర్సులు స్థానిక శ్రీపద్మావతి, శ్రీవాణి మహిళా డిగ్రీ కళాశాలలకు అనుమతులు లభించాయి. ఆమేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ చైర్మెన్ ప్రేమచంద్రారెడ్డినుంచి ఈ ఉత్తర్వులు బుధవారం అందాయి. శ్రీవాణి డిగ్రీ కళాశాలలో బీబీఏ హానర్స్‌కు 60సీట్లు, బీసీఏకు 50, బీఎస్సీ కెమిస్ట్రీకి 50 సీట్లు మంజూరైయ్యాయి. బీవోకేషనల్ డెయిరీ అండ్ యానిమల్ హస్బెండరీ, హార్టికల్చర్, కంప్యూటర్‌సైన్స్, బీఎస్సీ మ్యాథ్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్‌లకు 25 సీట్లను కేటాయించారు. శ్రీ పద్మావతిలో సింగిల్ మేజర్ సబ్జెక్టులుగా బీసీఏ హానర్స్, బీఎస్సీ(కంప్యూటర్) హానర్స్, బీకాం హానర్స్ కోర్సులు ప్రారంభం కానున్నట్లు ప్రిన్సిపాళ్లు కృష్ణమూర్తి రెడ్డి, శ్రీవాణి తెలిపారు.

అండర్–19 క్రికెట్ జట్టుకు ఎంపిక


మహేష్ కుమార్‌తో కోచ్ బాలాజీ

పలమనేరు: చిత్తూరు జిల్లా అండర్–19 క్రికెట్ జట్టుకు మున్సిపల్ పరిధి గడ్డూరు గ్రామానికి చెందిన రైతు కేశవులు కుమారుడు మహేష్‌కుమార్ ఎంపికయ్యాడు. వచ్చేవారం కడపలోని డాక్టర్ వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో జరుగనున్న సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో ఇతను పాల్గొననున్నాడు. ఆరేళ్లుగా పట్టణంలోని బాయ్స్ ఆఫ్ బాలు క్రికెట్ అకాడమిలో శిక్షణ పొందుతున్నాడు. బుధవారం పట్టణంలోని క్రికెట్ అభిమానులు బుధవారం మహేష్‌కుమార్‌ను, కోచ్ బాలాజీని సన్మానించి అభినందించారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ కుమారుడు మహేష్ కుమార్‌ను క్రికెట్‌లో ప్రోత్సహించారు. చదువులోనూ తీసిపోని మహేష్ మొన్న వెలువడిన ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో 470కి 441 మార్కులను సాధించాడు. చదువుతోపాటు క్రీడలు కూడా యువతకు అవసరమని బాలాజీ తెలిపారు. భవిష్యత్తులో మహేష్ రాష్ట్ర, జాతీయ జట్టులో ఆడాలని క్రికెట్ అభిమానులు కోరారు.

పురిటి బిడ్డను రోడ్డు పక్కన పడేశారు..


రోడ్డు పక్కన లభించిన పురిటి బిడ్డ



చిత్తూరు ఆస్పత్రికి బిడ్డ తరలింపు

బంగారుపాళెం: మండలంలోని బలిజపల్లె వద్ద బుధవారం సాయంత్రం రోడ్డుపక్కన పురిటి(మగ) బిడ్డను పడేసి ఉండగా స్థానికులు గుర్తించారు. బలిజపల్లె–టేకుమంద రహదారి కామాక్షమ్మ చెరువు వద్ద రోడ్డు పక్కన పురిటి బిడ్డ ఏడుపు వినిపించడంతో స్థానికులు అక్కడికి చేరుకున్నారు. బిడ్డను చేతుల్లోకి తీసుకుని పోలీసులకు సమా చారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బిడ్డను బంగారుపాళెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఐసీడీసీ సిబ్బంది పర్యవేక్షణలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు మూడు రోజుల కిందట ఎక్కడో పురుడు పోసుకుని బిడ్డకు తల్లి జన్మనిచ్చినట్లు తెలుస్తోంది. బిడ్డకు బొడ్డు కోసి ప్లాస్టర్ చుట్టిన ఆనవాళ్లు ఉన్నాయి. బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టి సంరక్షణ తీసుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఐ నాగరాజరావు తెలిపారు. మగబిడ్డను తాము పెంచుకుంటామంటూ పలువురు ముందుకు వచ్చారు.

జూలై 25న బ్రాహ్మణ సంఘం సమావేశం

పుంగనూరు: చంద్రగిరిలో జూలై 25, 26 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్రాహ్మణ పురోహితుల సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు సంఘం కార్యదర్శి రామమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో సమావేశం కరపత్రాలను విడుదల చేశారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు హాజరయ్యారు. రామమూర్తి మాట్లాడుతూ సమావేశానికి ఉమ్మడి జిల్లాలోని పురోహితులు అందరూ హాజరు కావాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక, ఇతర అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. సంఘ సభ్యులు రామకృష్ణ, మధు, గిరి, రవిప్రసాద్, శ్రీనివాసరావు, బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

టెండర్ల ద్వారా రూ.1.06 కోట్ల ఆదాయం


టెండర్లు నిర్వహిస్తున్న ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి):కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానానికి టెండర్ల ద్వారా రూ.1.06 కోట్ల ఆదాయం వచ్చినట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. బుధవారం ఈఓ కార్యాలయంలో ఏడాదికి సంబంధించి పలు నిర్వహణలకు టెండర్లు పిలిచారు. తలనీలాలు పోగు హక్కు నిర్వహణకు రూ.52.50 లక్షలు, బస్టాండ్‌లో క్యాంటిన్ నిర్వహణకు రూ.31.27లక్షలు, వాహన పూజ వద్ద క్యాంటిన్ నిర్వహణకు రూ.12.60లక్షలు, పూజలకు వచ్చే వాహనాలు శుభ్రం చేసేందుకు రూ.10.05 లక్షలు, మొత్తం రూ.1.06 కోట్లు ఆదాయం వచినట్లు తెలిపారు. గత ఏడాది కంటే అదనంగా రూ.60.21 లక్షల ఆదాయం వచ్చినట్లు వివరించారు.

విద్యారంగానికే అధిక కేటాయింపులు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పక్కన సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తదితరులు

చిత్తూరు కార్పొరేషన్: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వం విద్య కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం జెడ్పీ సమావేశ మందిరంలో సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన జెడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాడు–నేడు కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి, ఎంఈఓ–2 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. పదిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద నగదు బహుమతులతో ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న సురక్ష ద్వారా ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని జూలై 1న పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రైతులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. పాల ఉత్పత్తిని పెంచేలా చర్యలు తీసుకోవాలని, పట్టుసాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ద్వారా జిల్లాలో 320 సచివాలయాలు, 296 రైతు భరోసా కేంద్రాలు, 116 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించామని తెలిపారు. గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్‌ఈ శంకర్‌బాబు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ కింద నీటి సరఫరా పనులు 2,497 పూర్తి చేశామని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ తులసి మాట్లాడుతూ జిల్లాలో 2.67 లక్షల మందికి వివిధ రకాల పింఛన్లు ద్వారా రూ.794.50 కోట్లు అందజేస్తున్నామన్నారు. డ్వామా పీడీ గంగాభవాని మాట్లాడుతూ డ్వామా ద్వారా జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2.01 లక్షల కుటుంబాలకు 63 పనిదినాలను కల్పించి రూ.162.02 కోట్లు వేతనాలుగా ఇచ్చామని తెలిపారు.

రూ.694 కోట్ల రుణాలు

జిల్లా సహకార బ్యాంక్ మేనేజర్ ప్రసాద్ మాట్లాడుతూ సహకార బ్యాంక్ ద్వారా రూ.694 కోట్ల రుణాలను 85వేల మందికి ఇచ్చామని తెలియజేశారు. పౌరసరఫరా శాఖ ద్వారా 336 వాహనాల ద్వారా 1379 రేషన్‌షాపులకు బియ్యం అందజేస్తున్నామని డీఎస్‌ఓ మురళీకృష్ణ అన్నారు. జిల్లాలో 42 వేల క్వింటాల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశామని వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ తెలిపారు. ఉద్యానవనశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యాన, వ్యవసాయ చెరుకు, మల్బరీ, పశు గ్రాస పంటలకు మైక్రో ఇరిగేషన్ కోసం 70నుంచి 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలియజేశారు. మత్స్యశాఖ పథకాల వివరాలను సచివాలయాల్లో డిస్‌ప్లే బోర్డును పెట్టాలని వైస్ చైర్మన్ రమ్య కోరారు. పశు సంవర్ధకశాఖ ద్వారా 22.54 లక్షల గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు ఉచితంగా మందులను అందజేశామని జేడీ ప్రభాకర్ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ కిట్లు ప్రతి ఒక్కరికీ అందాలని శిశు సంక్షేమ కమిటీ చైర్మన్ భారతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను సంబంధిత అధికారులు వివరించారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం


సమీక్షలో సూచనలిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

- సైబర్‌క్రైమ్‌పై అవగాహన కల్పించాలి
- నేర సమీక్షలో చిత్తూరు జిల్లా ఎస్పీ రిషాంత్

చిత్తూరు అర్బన్: ఏటా సైబర్ క్రైమ్ నేరాలు 14 శాతం పెరుగుతున్నాయని.. ప్రజల్లో దీనిపై మరింత అవగాహన కల్పించాలని చిత్తూరు ఎస్పీ రిషాంత్ రెడ్డి ఆదేశించారు. బుధవారం చిత్తూరు పోలీసు శిక్షణ కేంద్రంలో అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ 'చాలా స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దర్యాప్తు పూర్తి చేసి, త్వరగా చార్జ్‌షీట్ వేయండి. ఎర్ర చందనం స్మగ్లింగ్, అక్రమ మద్యం, సారా తయారీ విషయాల్లో ఏ ఒక్కర్నీ ఉపేక్షించవద్దు. తరచూ ఇదే నేరాలు చేస్తున్న వారిపై పీడీ యాక్టులు నమోదు చేయండి. లోన్ యాప్ వలలో ప్రజలు చిక్కుకోకూడదు. అవసరమైన ఫోన్‌కాల్స్, మెయిల్స్‌కు స్పందిచవద్దని ప్రజల్లో అవగాహన కల్పించాలి' అని అన్నారు. రాత్రి గస్తీ వ్యవస్థను బలోపేతం చేసుకుని నేరాలు జరగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులపై అధికారులతో మాట్లాడారు. సైబర్ క్రైమ్‌పై ఫోన్–1930, డయల్–100 నంబర్లకు ఫిర్యాదు చేసేలా ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని సూచించారు. ఏఎస్పీ సుధాకర్, ఎస్‌ఈబీ అధికారి శ్రీలక్ష్మి, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసమూర్తి, శ్రీనివాసరెడ్డి పలువురు సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీలోకి బీజేపీ నేత



సెంథిల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం వెస్ట్ దళితవాడకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఎస్ఎం సెంథిల్ బుధవారం తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే ఆదిమూలం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సెంథిల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులు



రాజశేఖర్‌రెడ్డి, డీపీఓ

తిరుపతి అర్బన్ : జిల్లాలోని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు బుధవారం నిధులు విడుదల చేసినట్లు డీపీఓ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. తొలి త్రైమాసికానికి సంబంధించి రూ.1,69,93,692 అందించినట్లు వెల్లడించారు. ఈ నిధులను సర్పంచ్‌లు సద్వినియోగం చేసుకుని ఆయా గ్రామాల్లో తాగునీటి వసతి, పారిశుద్ధ్య చర్యలు, వీధిదీపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి కపిలేశ్వరుని పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్ : తిరుపతిలోని శ్రీకపిలేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం నుంచి జూలై 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ జరిపించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో చేపట్టే అర్చనలు, ఉత్సవాల్లో తెలియక జరిగే దోషాల పరిహారార్థం పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా తొలిరోజు 30వ తేదీ ఉదయం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం కలశ పూజ, హోమం, పవిత్ర ప్రతిష్ఠ చేపట్టనున్నారు. రెండో రోజు ఉదయం గ్రంథి పవిత్ర సమర్పణ, సాయంత్రం యాగశాల పూజ, హోమం జరిపించనున్నారు. మూడోరోజు ఉదయం మహాపూర్ణాహుతి, కలశోద్వాసన, పవిత్ర సమర్పణ నిర్వహించనున్నారు. సాయంత్ర 6 గంటలకు పంచమూర్తులకు శాస్త్రోక్తంగా ఆస్థానం జరిపించి ఉత్సవాలను పరిపూర్ణం చేయనున్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 69,143 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. 26,145 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. హుండీ ద్వారా స్వామి వారికి రూ.4.38 కోట్ల ఆదాయం వచ్చింది. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేనివారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

డీఎంహెచ్‌ఓగా శ్రీహరి కొనసాగింపు

తిరుపతి తుడా: తిరుపతి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిగా శ్రీహరిని కొనసాగించాలంటూ ఏపీ హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎలాంటి కారణాలు చూపకుండా తనను సరెండర్ చేస్తూ తన స్థానంలో మరొకరిని డీఎంహెచ్‌ఓగా నియమిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఉత్తర్వులు జారీ చేశారంటూ డాక్టర్ శ్రీహరి కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న హైకోర్టు ఆయన్నే కొనసాగించాలంటూ ఆదేశాల్లో పేర్కొంది.

విజేతలకు బహుమతుల ప్రదానం



క్విజ్ విజేతలతో కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఎస్వీజీఎస్ఎం స్కూల్‌లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బుధవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆర్‌బీఐ ఆధ్వర్యంలో జరిగిన పోటీలకు 34 మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానాన్ని జి.యోగేష్, సి.అభిలాష్ (జెడ్పీహెచ్ఎస్–తొండమనాడు), ద్వితీయ స్థానాన్ని జె.కార్తిక్, ఎన్.గీతిక (జెడ్పీహెచ్ఎస్–వెంగమాంబపురం), తృతీయ స్థానాన్ని పి.ముజహిద్, ఆర్.తెనిష్ (జెడ్పీహెచ్ఎస్–చిన్నగొట్టిగల్లు) కైవసం చేసుకున్నారు. తిరుపతిలోని మహిళా వర్సిటీ ఆడిటోరియంలో బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ.10వేలు, రూ.7,500, రూ.5వేల చొప్పున నగదు బహుమతిని ఆర్‌బీఐ ఆన్‌లైన్‌లో అందించనుంది. మెడల్స్, సర్టిఫికెట్లను కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మొదటి స్థానం సాధించిన విద్యార్థులు జూలై 14వ తేదీ విశాఖపట్నంలో ఆర్‌బీఐ నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు. తిరుపతి లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్, సీఎంఓ సురేష్, ఎంఈఓలు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- అట్టహాసంగా జగనన్న అమ్మఒడి కార్యక్రమం
- జిల్లాలో 1,52,542 మంది తల్లుల ఖాతాలకు రూ.228.81కోట్ల జమ



అమ్మఒడి మెగా చెక్కును ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్ సీపీ సర్కారు విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని డిప్యూటీ సీఎం నారాయణస్వామి, విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి జగనన్న అమ్మఒడి నాలుగో విడత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ విద్యకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. జగనన్న గోరుముద్ద, జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాకానుక, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి కార్యక్రమాలతో పేదల విద్యకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ ఏ పేద విద్యార్థి విద్యకు దూరం కాకూడదని ప్రభుత్వం జగనన్న అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల తల్లుల ఖాతాకు ఏటా రూ.15 వేలు జమ చేస్తోందన్నారు. నాలుగో విడతగా జిల్లాలోని 1,52,542 మంది తల్లుల ఖాతాలకు రూ.228.81 కోట్లు ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో అధిక కేటాయింపులు విద్యకు కేటాయించడం గొప్ప విషయమన్నారు.

ఉజ్వల భవితకు బాట

ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధికి అమలు చేస్తున్న పథకాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని చెప్పారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యాలు కింద నియోజకవర్గ, జిల్లా స్థాయిలో టెన్త్, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించిందన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ సర్కారు బడుల్లో డిజిటల్ విద్యను తీసుకొచ్చిన ఘనత సీఎం దక్కుతుందన్నారు.

ప్రపంచస్థాయిలో పోటీపడేలా

కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో పిల్లలు పోటీపడేలా ప్రభుత్వం విద్యా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల తల్లులకు అమ్మఒడి లబ్ధి చేకూరుతోందన్నారు. అనం తరం అమ్మఒడి నాల్గవ విడత మెగా చెక్కును ఆవిష్కరించారు. అంతకు ముందు ప్రొజెక్టర్ ద్వారా పార్వతీపురం జిల్లా కురుపాంలో జరిగిన అమ్మఒడి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని మంత్రులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు లైవ్‌లో వీక్షించారు. విద్యార్థులు థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, జెడ్పీ మహిళా స్థాయి సంఘం చైర్మన్ భారతి, డీఈవో విజయేంద్రరావు, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఆర్‌ఐవో రమేష్, డీవీఈవో దయానందరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు విరుపాక్షరెడ్డి, కార్పొరేటర్ హరిణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



థ్యాంక్యూ సీఎం సర్ ప్లకార్డులను చూపుతున్న విద్యార్థులు

ఎస్వీయూలో జాతీయ సదస్సు ప్రారంభం



సదస్సును ప్రారంభిస్తున్న ఎస్వీయూ, మహిళా వర్సిటీ వీసీలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఏఐ, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ అంశాలపై ఏర్పాటు చేసిన రెండు రోజుల జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి, మహిళా వర్సిటీ వీసీ డి.భారతి, ఎస్వీయూ రిజిస్ట్రార్ మహమ్మద్ హుస్సేన్ ప్రారంభించారు. 2025–2030 నాటికి ఈ టెక్నాలజీలు ప్రపంచ దేశాల ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను శాసించనున్నట్లు పేర్కొన్నారు. అంతటి ప్రాముఖ్యత ఉన్న వీటిపై జాతీయ స్థాయిలో సదస్సు నిర్వహించడం అభినందనీయమని, సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మావతమ్మ, బీడీఓ హర్షవర్ధన్‌రెడ్డి, ప్రొఫెసర్ కాళిదాస్, నిర్వాహకులు అంజన్‌బాబు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : 10 మందికి గాయాలు



బోల్తా పడిన ఆటో



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

డక్కిలి : మండలంలోని వెంకటగిరి– రాపూరు జాతీయ రహదారిపై బుధవారం ఆటో బోల్తా పడడంతో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. వడ్ల మోపూరు గ్రామానికి చెందిన ఇద్దరు ఏజెంట్లు వరినాట్ల కోసం ఇటీవల కోల్‌కత్తా నుంచి 150 మంది కూలీలను మోపూరుకు తీసుకువచ్చారు. పలు గ్రామాల్లో వరినాట్లు వేసిన కూలీలు పనులు ముగించుకుని తిరుగుప్రయాణానికి ఆటోల్లో వెంకటగిరి రైల్వేస్టేషన్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో పలుగోడు గ్రామం వద్ద ఓ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మిల్టన్ డాల్వి, అజిట్ డాల్వి, శ్యాముల్ డాల్వి, బబుల్ మహత, చిట్టాన్ రహన్, మ్రిత్యురన్ జాయి, డ్వాలర్ సర్దార్‌తో పాటు మరో ముగ్గురు కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను 108లో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

రైల్వే గూడ్స్‌షెడ్ నిర్మాణానికి స్థల పరిశీలన

తడ: పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన తడలో సరుకు రవాణా సౌకర్యం మెరుగు పరచడానికి, గూడ్స్ రైళ్లు నిలిపేందుకు, సరుకు రవాణా సాగించేందుకు వీలుగా అనువైన స్థలం కోసం బుధవారం రైల్వే అధికారులు తడలో పర్యటించి, స్థల పరిశీలన చేశారు. తడ రైల్వేస్టేషన్ సమీపంలోని సుజాతనగర్ వద్ద ఉన్న స్థలాన్ని రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ రవీంద్రన్ ఆధ్వర్యంలో ఓ బృందం పరిశీలించింది.

ప్రణాళికాబద్ధంగా భూముల రీసర్వే



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ

- జగనన్నకు చెబుదాం.. జగనన్న సురక్షపై ప్రత్యేక దృష్టి
- పకడ్బందీగా భూహక్కు పత్రాల పంపిణీ
- అలసత్వం వహిస్తే కఠిన చర్యలు
- కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని సావేరి సమావేశ మందిరంలో జగనన్న శాశ్వత భూ హక్కు– భూరక్ష పథకంపై నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ తరగతిలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రీసర్వే ఫేజ్–2ను పకడ్బందీగా చేపట్టాలన్నారు. కొన్ని మండలాలు ఇప్పటికీ సర్వేలో వెనుకబడి ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతం చేయించాలని స్పష్టం చేశారు. సకాలంలో ఫైనల్ ఆర్ఓఆర్, సర్వే రాళ్ల నాటే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ఫేజ్–1లో తలెత్తిన లోపాలను ఫేజ్–2లో సరిచేయాలని కోరారు. అలాగే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జగనన్న సురక్షలో భాగంగా లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న సర్టిఫికెట్లను వెంటనే మంజూరు చేయాలని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ రీసర్వేపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఓఆర్ఐ రాని మండలాల తహసీల్దార్లు కూడా రీసర్వేపై శ్రద్ధ వహించాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్, వెక్టరైజేషన్ ఒక్కరోజులోనే పూర్తి చేయాలని ఆదేశించారు. సాదాబైనామా భూములను రెగ్యులరైజ్ చేయించాలని తెలిపారు. భూహక్కు పత్రాలను పంపిణీకి జెనరేట్ చేయకముందే రైతుల ఫొటోలు, ఆధార్, ఫోన్ నంబర్ తదితర వివరాలను సరిచేసుకోవాలని ఆదేశించారు. అనంతరం రీ సర్వే ప్రక్రియపై అవగాహన కల్పించేలా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అందించారు. డీఆర్ఓ కోదండరామిరెడ్డి మాట్లాడుతూ భూములకు సంబంధించి కోర్టు కేసులు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు మాట్లాడుతూ జేసీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వీఆర్ఓలు, విలేజ్ సర్వేయర్లకు రీసర్వేపై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. వ్యవసాయ భూములకు మాత్రమే సాదా బైనామా చేయడానికి అవకాశముంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ భాస్కర్ నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ , గూడూరు, తిరుపతి ఆర్డీఓలు కిరణ్ కుమార్, కనకనరసారెడ్డి, ఏడీ సర్వేయర్ జయరాజ్ పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన డీఆర్‌వోలు, ఆర్డీవోలు, తహసీల్దార్‌లు

లారీ ఢీకొని ఒకరి మృతి

రేణిగుంట : రేణిగుంట చెక్‌పోస్టు సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. తిరుచానూరు పూడి మార్గంలోని చంద్రశేఖరకాలనీకి చెందిన జి.గోపి(38) బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో తిరుపతి రుయాకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపారు.



ప్రమాదానికి కారణమైన లారీ

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెళ్లకూరు : మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న శ్రీవైష్ణవి డెయిరీ ప్లాంట్ మేనేజర్ పూడి గోపాల్(54) పరిశ్రమ ఆవరణలోనే ఉరి వేసుకొని మృతి చెందిన విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శ్రీకాళహస్తి మండలం, బొక్కిసంపాళానికి చెందిన గోపాల్ నాలుగేళ్లుగా డెయిరీలో పని చేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకున్న తర్వాత ఆత్మహత్యకు పాల్పడినట్లు కార్మికులు గుర్తించారు. నాయుడుపేట సీఐ సోమయ్య, ఎస్ఐ కృష్ణారెడ్డి ఘటనాస్థలానికి చేరుకుని సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో అప్పుల బాధ భరించలేక మరణిస్తున్నానని, దయచేసి తన కుటుంబానికి సాయం చేయాలని పేర్కొని ఉంది. అయితే డెయిరీ యాజమాన్యం సక్రమంగా జీతాలు చెల్లించకపోవడం వల్లే ప్రతి నెలా ఈఎంఐలు కట్టలేక గోపాల్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోలీసులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుమార్తె బెంగళూరులో మెడిసిన్ ఫైనలియర్ చదువుతుండడం గమనార్హం.

కార్పొరేట్ తరహాలో రుయా క్రిటికల్ కేర్

- రుయా అభివృద్ధికి రూ.400 కోట్లు కేటాయించిన ప్రభుత్వం
- విభాగాల సమన్వయంతో లోపాలను అధిగమిస్తాం
- మెయింటెనెన్స్ గ్రాంట్ ఇచ్చిన ఏకైక ప్రభుత్వం
- రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు



రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఆస్పత్రుల అభివృద్ధికి వందలాది కోట్లు కేటాయిస్తోంది. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని రుయా ఆస్పత్రిని కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్ది నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కృషి చేస్తామని రుయా సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ రవిప్రభు సాక్షికి తెలిపారు. రుయాలో అందుతున్న వైద్యసేవలు, అభివృద్ధికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు..

కార్పొరేట్ తరహాలో రుయా క్రిటికల్ కేర్ విభాగాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రూ.23.75 కోట్లతో 16 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించనున్నాం . క్రిటికల్ కేర్‌తో పాటు ఓటీ, ఐసీయూ, సెంట్రల్ ల్యాబ్, సీటీ, ఎమ్ఆర్ఐ వంటివి ఒకేచోట ఉండేలా ప్రతిపాదనలు అమలుచేయనున్నాం. ఏడాది కల్లా భవనాన్ని నిర్మించి పేదలకు అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు చర్యలు మొదలయ్యాయి.

ప్రాధాన్యతాక్రమంలో పనులు

నాడు–నేడు పథకం ద్వారా రుయా, ఎస్వీ మెడికల్ కళాశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.90 కోట్లకు సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. ప్రాధాన్యతాక్రమంలో పనులను పూర్తిచేస్తాం. ఈ నిధులతో పాటు ఆస్పత్రి, మెడికల్ కళాశాల మెయింటెనెన్స్ కోసం ఎప్పుడూ లేని విధంగా తొలిసారి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఎప్పటికప్పుడు భవనాల ఆధునీకరణ, మరమ్మతుల కోసం రుయాకు రూ.3.5 కోట్లు, ఎస్వీ మెడికల్ కళాశాలకు రూ.2.5 కోట్లు కేటాయించిన ఏకైక ప్రభుత్వం ఇదే.

పెరిగిన మెడికల్ కళాశాల స్థాయి

రాష్ట్ర ప్రభుత్వ కృషితో నేషనల్ మెడికల్ కౌన్సిల్ తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు 93 పీజీ సీట్లను ఇటీవల మంజూరు చేసింది. ఈ స్థాయిలో పీజీ సీట్లు పెరగడం ఇదే తొలిసారి. పెరిగిన పీజీ సీట్ల నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు రెట్టింపు స్థాయిలో మంజూరవుతాయి. వసతి, వైద్య విద్య సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.90 కోట్లు కేటాయించింది. మరింతగా నిధులు మంజూరు కానున్నాయి.

లోపాలను అధిగమిస్తాం

రుయా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టాగా ఇక్కడి లోపాలను గుర్తించాను. వాటిని అధిగమించడంపై దృష్టి సారించాను. ట్రయేజ్, అత్యవసర విభాగాన్ని వెంటనే గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది. విభాగాధిపతులు, వైద్యాధికారులతో సమీక్షలు నిర్వహించి అందరి సమన్వయంతో అత్యవసర విభాగాన్ని మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతాం. ఎఫ్ఎన్ఓ, ఎంఎన్ఓల కొరతను అధిగమిస్తాం. సీఎంఓలు, పీజీలను 24 గంటలూ కచ్చితంగా అందుబాటులో ఉంచుతాం. టీటీడీ చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో పల్మనాలజీ వార్డు తొలగించాల్సి వస్తోంది. ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి చొరవ తీసుకుని టీటీడీనే కొత్త భవనాన్ని కట్టించి రుయాకు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది.

త్యాగానికి ప్రతీక బక్రీద్



నారాయణస్వామి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ఆర్‌కే రోజా

తిరుపతి అర్బన్ : దైవ ప్రవక్త త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పవిత్ర పండుగను ముస్లింలు సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జేసీ డీకే బాలాజీ తదితరులు ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని కోరారు.

శ్రీకాళహస్తిలో 30 పోలీస్ యాక్ట్

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ పరిధిలో 30 పోలీస్‌యాక్ట్ అమల్లో ఉన్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

నేటి నుంచి శ్రీనివాస చతుర్వేద హవనం

తిరుపతి కల్చరల్: టీటీడీ పరిపాలన భవన మైదానంలో గురువారం నుంచి జూలై 5వ తేదీ వరకు శ్రీనివాస చతుర్వేద హవనం నిర్వహించనున్నారు. నిర్వహణకు సర్వం సిద్ధమైంది. తొలి రోజు ఉదయం 8 గంటలకు కలశ స్థాపన, కలశ ఆవాహనతో కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందు కోసం యజ్ఞ వేదిక, హోమ గుండాలు సిద్ధం చేశారు. 32 మంది రుత్వికులు నాలుగు వేదాల్లోని మంత్రాలు పఠిస్తూ హవనం నిర్వహిస్తారు. భక్తులు కూర్చుని కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీలుగా మ్యాట్లు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. సాంస్కృతిక వేదిక, బారికేడ్లు, భక్తులను ఆకట్టుకునేలా పుష్ప, విద్యుత్ దీపాలంకరణలు చేశారు. కాగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చతుర్వేద మంత్ర పారాయణం జరుగనుంది. 6 నుంచి రాత్రి 6.30 గంటల వరకు వైఎల్ శ్రీనివాసులు, బి.కేశన్న బృందం నాదస్వరం, డోలు వాయిద్య సంగీతం నిర్వహిస్తారు. అనంతరం డాక్టర్ శబరి గిరీష్ బృందంతో భజనామృతం, అనంతరం ఆచార్య చిర్రావూరి శ్రీరామ శర్మతో చతుర్వేద హవనం కార్యసిద్ధి అనే అంశంపై ప్రవచనం ఉంటుంది. రాత్రి 7.50 నుంచి 8.30 గంటల వరకు పి.రవిసుబ్రమణ్యం బృందంతో రామాయణ నృత్య రూపక ప్రదర్శన జరగనుంది.

అనుమతి లేకుండా రోడ్డుపై ధర్నా

-టీడీపీ నేతలపై కేసు నమోదు

పిచ్చాటూరు: ధర్నా పేరిట గంటల పాటు జాతీయ రహదారిపై బైటాయించి రాకపోకలకు అంతరాయం కలిగించిన ఐదుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప తెలిపారు. అరుణానదిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారంటూ నాగలాపురానికి చెందిన టీడీపీ నేతలు శ్రీనివాసులు యాదవ్, సంతోష్ నాయుడు, నెల్సన్ మండేలా, పార్తిబన్, తిరుపతి మంగళవారం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద జాతీయ రహదారిపై సుమారు 3 గంటల పాటు ధర్నా చేసిన సంగతి తెలిసిందే. ధర్నాకు అనుమతి తీసుకోకపోవడంతో పాటు ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించిన వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చోరీకి యత్నం.. నిందితుడి అరెస్ట్



నిందితుడితో మాట్లాడుతున్న పోలీసులు

తిరుత్తణి: బస్సులో ప్రయాణిస్తున్న వృద్ధుడి నుంచి ఏడు సవర్ల నగలను చోరీ చేసి పరారైన వ్యక్తిని ప్రజలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపం అగ్రహారానికి చెందిన సుందరం(73). ఇతను తమ్ముడి కుమారుడి వివాహానికి భార్య కృష్ణమ్మతో కలిసి మంగళవారం సాయంత్రం శ్రీకాళహస్తి నుంచి తిరుత్తణికి ప్రైవేటు బస్సులో వెళ్లారు. వృద్ధుడి పక్కన కూర్చున్న వ్యక్తి తిరుత్తణి బైపాస్ సర్కిల్ వద్ద ఆగకముందే దూకి వేగంగా వెళ్లాడు. అనుమానించిన వృద్ధుడు నగలు చూసుకోగా చోరీకి గురయ్యాని గుర్తించి కేకలు వేశారు. అక్కడ వున్న స్థానికులు పారిపోతున్న వ్యక్తిని వెంబడించి పట్టుకుని నగలు స్వాధీనం చేసుకుని చితకబాది పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు రేణిగుంట సమీపంలోని కరకంబాడికి చెందిన రజని(47) అని తెలిసింది. ఆ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి తిరుత్తణి సబ్‌జైలుకు తరలించారు.


Happy Birthday
SRI CHEVIREDDY
MOHITH REDDY
M.S LONDON
[Tirupati Rural Mandal MPP
Chandragiri Constituency YSRCP MLA Candidate]
గడప గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న సారథి..
ఆగని అభివృద్ధికి జీవం పోస్తున్న మహారథి...
ఇచ్చిన మాటే వేదంగా.. తండ్రి బాటే ఆదర్శంగా..
స్వచ్ఛమైన పాలన అందిస్తున్న నాయకుడు...
పేదల ఉన్నతికి అనునిత్యం తపిస్తున్న శ్రామికుడా!
మీ పుట్టిన రోజు మాకు పండుగ రోజు..
మన ప్రియతమ నాయకులు
శ్రీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
ఆర్.మదన్ మోహన్
వై.యస్.ఆర్.సీ.పీ. ఐటి వింగ్
తిరుపతి జిల్లా
కంచన లోకేష్
చిన్నగొట్టికల్లు వై.యస్.ఆర్.సీ.పీ. ఇంచార్జ్
యర్రావారిపాలెం మండలం
చింటు (దేవరకొండ)
వై.యస్.ఆర్.సీ.పీ. నాయకులు
చిన్నగొట్టిగల్లు మండలం
సి.హెచ్.మహేశ్వర్ రెడ్డి
వై.యస్.ఆర్.సీ.పీ. నాయకులు
యర్రావారిపాలెం మండలం
బి.జనార్ధన్ రెడ్డి
వై.యస్.ఆర్.సీ.పీ. నాయకులు
పాకాల మండలం